నిర్వేద ఆయుర్వేదం!

ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు



మూతపడిన ఎక్స్‌రే యూనిట్

- పడకలు పెంచారు.. సిబ్బంది, పరికరాలు మరిచారు..
- రోగులకు శాపం.. వైద్య విద్యార్థులకు బోధనా లోపం..
- 100 పడకల రోగులకు 58 పడకల స్థాయి వైద్యులు, సిబ్బందే సేవలు
- దశాబ్దాలు తరబడి మూతపడిన ఎక్స్‌రే యూనిట్
- సర్కారు దృష్టి సారించాలంటున్న రోగులు

గిర్మాజిపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. అలాగే ఆయుర్వేద వైద్య విద్యార్థులకు బోధనా లోపంగా పరిణమించింది. ఆయుర్వేదంపై విశ్వాసం, మెరుగైన వైద్య సేవలు, దుష్ప్రభావాలు లేని మందులతో రోగుల సంఖ్య, బీఏఎంఎస్ సీట్లు పెరుగుతున్నా.. అవసరమైన వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రిలో వంద పడకలున్నా.. వైద్యులు, సిబ్బంది మాత్రం 58 పడకల మేరకే ఉండటంతో రోగులున్నా.. వైద్యులు లేని పరిస్థితి నెలకొంది. వైద్యుల తరువాత అంతే కీలకమైన నర్సింగ్ సిబ్బంది అసలే లేని ఆస్పత్రిగా పేరు గడిచింది. దశాబ్దాలుగా ఎక్స్‌రే యూనిట్ వినియోగంలోకి రాకపోవడంతో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి పరిస్థితి డిస్పెన్సరీకి ఎక్కువ.. బోధనకు తక్కువ.. అన్న చందంగా మారింది.

వరంగల్ రైల్వే, ఆర్టీసీ బస్‌స్టేషన్‌లకు కూతవేటు దూరంలో గ్రౌండ్, మొదటి అంతస్థులో నిర్మితమైన భవనంలో 100 పడకలతో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి రోగులకు సేవలు అందిస్తోంది. అనంతలక్ష్మి వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రిగా నిత్యం 300 అవుట్ పేషంట్‌లు, 90 మంది ఇన్‌పేషంట్‌లకు మెరుగైన ఆయుర్వేద వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ రోగుల విశ్వాసాన్ని చూరగొంది. ఆయుర్వేదంలో కీలకమైన కాయచికిత్స (జనరల్ మెడిసిన్), పంచకర్మ (ఆయుర్వేద ప్రత్యేక వైద్య చికిత్స), శల్య (జనరల్ సర్జరీ), శాలక్య (చెవి, ముక్కు, గొంతు), కౌమారభృత్య (పిల్లల విభాగం), ప్రసూతి స్త్రీరోగ (గైనకాలజీ), స్వస్థ్యరక్షణ (ప్రివెంటివ్ మెడిసిన్) విభాగాలు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఆస్పత్రిలోని 100 పడకలలో కాయచికిత్సకు 25, పంచకర్మకు 25, శల్యకు 15, శాలక్యకు 10, కౌమార భృత్యకు 10, ప్రసూతి స్త్రీ రోగకు 15 పడకలతో వార్డులున్నాయి. జలుబు, దగ్గు, జ్వరం, మధుమేహం రోగులు కాయచికిత్స వార్డులో, పక్షవాతం, కీళ్లు, నడుము, వెన్నుముక, స్పాండిలైటిస్ రోగులు పంచకర్మ, అర్షమొలలు, భగంధరం, వెరికోస్ వెయిన్స్, డయాబెటిక్ ఫుట్ రోగులు శల్య వార్డులో, మైగ్రేన్, సైనసైటిస్, సోరియాసిస్ రోగులు శాలక్య వార్డులో, పిల్లలకు సంబంధించి ముఖ్యంగా మానసికంగా, శారీరకంగా ఎదుగుదలలేని, నడువలేని వ్యాధులకు కౌమార భృత్య వార్డులో, ప్రసవాలు, స్త్రీ సంబంధిత వ్యాధులకు ప్రసూతి స్త్రీ రోగ వార్డులో వైద్య చికిత్స పొందుతారు. అన్ని ఇన్‌పేషంట్ వార్డులలో సుమారు 80 మందికి పైగా రోగులు వైద్య చికిత్సలు పొందుతుంటారు. అలాగే ప్రైవేటు చార్జీలతో ప్రత్యేక గదులు కూడా ఉన్నాయి.

100 పడకలకు 58 పడకల సిబ్బందే..

ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధ బోధన ఆస్పత్రిగా ఉన్న దీన్ని 58 పడకల నుంచి 100 పడకలకు రాష్ట్ర ప్రభుత్వం 20ఏళ్ల కిందటే అప్‌గ్రేడ్ చేసింది. అంతేకాదు 150 పడకల స్థాయిలో ఆస్పత్రికి ప్రస్తుత నూతన భవనం నిర్మించారు. కానీ, పడకలను పెంచి నూతన భవనం నిర్మించినా గత ప్రభుత్వాలు వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులను 100 పడకల స్థాయిలో పెంచకపోవడంతో ఆయుర్వేద వైద్యం అరకొరగానే అందుతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయుర్వేద వైద్యంకు సంబంధించిన 8 వైద్య విభాగాలలో అవసరమైన వైద్యులకు తోడు వైద్య సహాయకులు లేని పరిస్థితి ఉంది. దీంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే 300లకు పైగా ఔట్‌పేషంట్, ఆస్పత్రిలో ఉండే 90 ఇన్‌పేషంట్ రోగులకు తగిన వైద్య చికిత్సలు అందించడంలో వైద్యులు, సిబ్బందిపైనే తీవ్రమైన ఒత్తిడి పడుతున్నదని అంటున్నారు.

మూతపడిన ఎక్స్‌రే యూనిట్

ఆస్పత్రి ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్ పాడవటంతో దానిని మరమ్మతు చేయించకపోవడంతో పాటు రేడియోగ్రాఫర్, ఎక్స్‌రే టెక్నీషియన్ తదితర పోస్టులు రిటైర్ అవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ మూతపడి దశాబ్దాలు గడిచింది. నడుము, కీళ్ల నొప్పులు, స్పాండిలైటిస్, మెడనొప్పులు, పక్షవాతం తదితర వ్యాధులకు పంచకర్మలో మంచి చికిత్స ఉన్నప్పటికీ ఈ రోగులకు ఎక్స్‌రే తప్పనిసరి. దీంతో ఈ రోగులు బయట ఎక్స్‌రే, ఎంఆర్ఐ ప్రైవేటుగా తీయించుకుని ఇక్కడ ఆయుర్వేద వైద్యచికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో పాడైన ఎక్స్‌రే యూనిట్ స్థానంలో కొత్తగా కలర్ డాప్లర్, స్కానింగ్, ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

నర్సింగ్, నాలుగో తరగతి సిబ్బంది అసలే లేరు..



ఈ ఆస్పత్రిలో వైద్యుల తరువాత అంతే ప్రాముఖ్యం ఉన్న నర్సింగ్ అధికారులు అసలే లేరు. ఆస్పత్రిలోని 7 నర్సింగ్ అధికారులు, ఒక సీనియర్ నర్సింగ్ అధికారి (హెడ్‌నర్సు) రిటైర్ అయి సంవత్సరాలు గడుస్తోంది. ప్రభుత్వం ఇంత వరకు ఇక్కడ నర్సింగ్ అధికారులను నియమించలేదు. అలాగే నాలుగో తరగతి సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రిలో ఊడ్చడం మొదలు ఆపరేషన్ థియేటర్‌లో వైద్య సహాయకులు లేరు. ఆస్పత్రికి సెక్యూరిటీ సిబ్బంది సైతం లేకపోవడంతో వరంగల్ బస్, రైల్వేస్టేషన్‌లలో గంజాయి సేవించి తిరిగే పలువురు వ్యక్తులు రాత్రి వేళ ఆస్పత్రిలో చొరబడి రోగుల వస్తువులు దొంగిలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ అల్లోపతి ఆస్పత్రి తరహాలో ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలోనూ సెక్యూరిటీ, పారిశుధ్యం, రోగుల సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏర్పాటుచేస్తే ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుతాయని ప్రజలు అంటున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది, వైద్యులు, వైద్య పరికరాల కొరతను ప్రభుత్వం సత్వరం తీర్చితే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు, వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన అందుతాయంటున్నారు.

మినీ జాతరకు సిద్ధం కావాలి

మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధబోయిన జగ్గారావు

మేడారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క- సారలమ్మ మేడారం మినీ జాతరకు పూజారులు సిద్ధంగా ఉండాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు అన్నారు. వనదేవతల గద్దెల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పూజారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర జరగనున్న నేపథ్యంలో పూజారులు సన్నద్ధం కావాలన్నారు. మేడారంలో భక్తుల రాక గణనీయంగా పెరుగుతోందని, పూజారులు గద్దెల వద్ద నిరంతరంగా ఉండాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. పూజాలరు సమస్యలను దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పూజారులు కొక్కెర కృష్ణయ్య, రమేష్, కాక సారయ్య, కిరణ్, వెంకన్న, మహేష్, బోజరావు, రాజారమేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కార్తీక సందడి



ఉసిరిక చెట్టు కింద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సందడి నెలకొంది. కార్తిక మాసం చివరి ఆదివారం సెలవు దిన కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమం గోదావరి వద్ద పున్య స్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు సారె, చీర, పాలు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వదిలి పెట్టారు. ముక్తీశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఉసిరిక చెట్టుకింద భక్తులు లక్ష వత్తులు వెలిగించి పూజలు చేశారు. దీంతోపాటు లక్షపత్రి పూజలను స్వామి వారికి సమర్పించారు. సుమారు 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. దీంతో ఒక్కరోజు రూ.4.80 లక్షలు ఆదాయం సమకూరిందని అన్నారు.

సమగ్ర సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తన వివరాలను నమోదు చేయించుకున్నారు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ. మంజూర్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్యుమరేటర్ రమేష్‌కు వివరాలు వెల్లడించారు. సర్వే నిర్వహణపై నిత్యం అధికారులను అప్రమత్తం చేస్తూ బిజీగా ఉన్న కలెక్టర్. తన వివరాలను ఆదివారం నమోదు చేయించుకున్నారు.



ఎన్యుమరేటర్‌కు వివరాలు చెబుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

ములుగు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సత్వరమే నెరవేర్చాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదుగుల పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎన్టీయూ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో పర్వతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగులకు రావాల్సిన ఐదు కరువుభత్యాలను ప్రకటించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుపరిచి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

పే రివిజన్ కమిషన్ నుంచి నివేదికలు తెప్పించుకుని 2023 జులై 1 నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగులందరికీ నూతన పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని పర్వతరెడ్డి కోరారు. ప్రతి గిరిజన ఆవాసంలో ఒక గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని, అన్ని యాజమాన్య పరిధిలో ఉన్న విద్యాసంస్థలను ఏకీకృతం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆటో సదయ్య హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, హెడ్‌క్వార్టర్ సెక్రటరీ పోల్‌రెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- ఏటూరునాగారంలో అంగన్‌వాడీలకు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం




క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, హైదరాబాద్‌లోని గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐటీడీఏ భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకరతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో కష్టనష్టాలకోర్చి గర్భిణులు, బాలింతలు, శిశువులకు పౌష్టికాహారం అందిస్తూ వారి మెరుగైన జీవనానికి పాటుపడుతున్న అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. క్యాన్సర్ మహమ్మారి ఏ రూపంలో వస్తుందో మనకు తెలియదని, ముందస్తు పరీక్షలు చేయించుకొని నిర్ధారణ చేయించుకోవడం ముఖ్యమని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలు, ఇతర పనుల్లో నిమగ్నమై ఉంటూ ఆరోగ్యాన్ని పట్టించుకోరని, దీంతో సాధారణ ఇన్ఫెక్షన్లు కాస్త ప్రమాదకర క్యాన్సర్లుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అనంతరం చిన్నబోయినపల్లిలోని జాతీయ రహదారి సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. డివైడర్ మధ్య మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, యూత్ బ్లాక్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ నామ కరంచంద్ గాంధీ, పార్టీ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎమ్డీ. అఫ్సర్, ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సరకొప్పుల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నవీన్, ఎమ్డీ.గౌస్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, వెంకటాపురం మార్కెట్ కమిటీ చైర్మన్, ఏటూరునాగారం సీడీపీవో ప్రేమలత, తాడ్వాయి సీడీపీవో జి.మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. భూపాలపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కాటారంలోని జడ్పీహెచ్ఎస్‌లో దీన్ని నిర్వహించారు. కాటారంలో 202 మంది విద్యార్థులక 194 మంది హాజరయ్యారు. భూపాలపల్లిలో 232 మందికి 217 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఐదేళ్లపాటు రూ.12వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్పు చెల్లించనున్నట్లు డీఈవో ఎం.రాజేందర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆయనతోపాటు పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

క్రైం కార్నర్

మందుబాబులపై కొరడా!

- ఏకకాలంలో 65 మందిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసులు కొరఢా ఝులిపించారు. ఇటీవల పట్టుబడిన మందుబాబులను ఏకకాలంలో కోర్టులో హాజరుపర్చారు. డీఎస్పీ సంపత్‌రావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి సబ్‌డివిజన్ పరిధి భూపాలపల్లి, గణపురం, రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులో మద్యం సేవించి పట్టుబడ్డారు. దీంతో మొత్తం 65 మందిని శనివారం భూపాలపల్లి కోర్టులో హాజరు పర్చారు. వారిలోని తొమ్మిది మందికి రెండు రోజుల జైలు శిక్ష, మిగతా 56 మందికి జరిమానాలను జిల్లా మెజిస్ట్రేట్ విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఎన్నిమార్లు హెచ్చరించినా మద్యం ప్రియుల్లో మార్పు రావడం లేదన్నారు. దీంతో పట్టుబడిన వారందరినీ ఏకకాలంలో కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. ఇకనైనా వాహనదారుల్లో మార్పు రావాలని సూచించారు.

‘లగచర్ల’పై ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటాలు

- తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వంద సీట్లు గెలుస్తాం..
- మానుకోటలో నేటి మహా ధర్నాను జయప్రదం చేయండి
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్ల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి గిరిజన రైతులకు న్యాయం చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటాలు ఆగవని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మహబూబాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ.. లగచర్లలో గిరిజన రైతులకు జరిగిన అన్యాయంపై మానుకోటలో ధర్నా నిర్వహిస్తామంటే ఎందుకంత భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధర్నాను అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. కోర్టు అనుమతితో ధర్నా నిర్వహించేందుకు తాము సిద్ధం కాగా, ఎవరు ధర్నాకు వెళ్ల వద్దంటూ బెదిరింపులు ఆరంభం చేశారని విమర్శించారు. సీఎం తన సొంత నియోజకవర్గంలోని గిరిజనులపై దౌర్జన్యాలెందుకని ప్రశ్నించారు. మహారాష్ట్రలో దుమ్ము లేపుతానని వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన స్థానాల్లో కాంగ్రెస్ ఓటమి పాలైందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, కేటీఆర్ బయటకు వస్తేనే సభలకు అనుమతి ఇవ్వడం లేదని, ఇక మాజీ సీఎం కేసీఆర్ వస్తే ఇస్తారా? అంటూ నిలదీశారు. రాష్ట్రంలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్ పార్టీ వంద సీట్లు గెలుస్తుందని ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇది తాము చెబుతున్నది కాదని, కాంగ్రెస్ సర్వేలే చెబుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, పరిశ్రమలు రావడం లేదని పేర్కొన్నారు. సీఎం సొంత ఊరిలో ఆయన సోదరుల ఒత్తిళ్లతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

మేడారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సందడి నెలకొంది. వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 15వేల మందికి మొక్కులు చెల్లించుకొని ఉంటారని దేవాలయం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యాట మొక్కులు ముట్టజెప్పి పరిసరాల్లో చెట్ల కింద, వసతి భవనాల్లో విడిది చేశారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క

గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేస్తున్న మంత్రి సీతక్క



ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మానవత్వం చాటుకున్నారు. ఏటూరునాగారం పర్యటనకు ఆదివారం వచ్చిన ఆమె వివిధ కార్యక్రమాలను ముగించుకొని తిరిగి ములుగుకు పయనయ్యారు. అదే క్రమంలో ఓ వ్యక్తి ములుగు వైపు నుంచి ఏటూరునాగారం వస్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో అతడు గాయపడ్డాడు. అటు వైపు వచ్చిన మంత్రి ఈ దృశ్యాన్ని చూసి కాన్వాయ్ ఆపారు. క్షతగాత్రుడిని దగ్గరుండి కాంగ్రెస్ నాయకుల ద్వారా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

మోతాదుకు మించి మత్తు మందు ఇవ్వడంతో చిన్నారి మృతి

చిన్నగూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంటిలో కర్రముక్క గుచ్చుకోవడంతో చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లికి చెందిన ఆది రవి-మౌనిక దంపతుల కూతురు హన్విక (5)ను చికిత్స కోసం హైదరాబాద్‌లోని హబ్సిగూడలోని ఓ ప్రైవేట్ కంటి ఆస్పత్రికి తీసుకొచ్చారు. కంటికి సర్జరీ చేయడం కోసం చిన్నారికి వైద్యులు మోతాదుకు మించిన మత్తుమందు ఇవ్వడంతో హన్విక శనివారం మృతి చెందింది. ఆదివారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో హన్విక గుండెను డొనేట్ చేసి, మృతదేహాన్ని స్వగ్రామం ఉగ్గంపల్లికి తీసుకొచ్చారు.



హన్విక (ఫైల్)

ఈ విషయం తెలిసిన కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు అంతా చిన్నారి మృతదేహం చూసి విలపించారు. ఐదేళ్లు అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు వైద్యుల నిర్లక్ష్యంతో కానరాని లోకానికి పోవడంతో జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆ దంపతులు గుండెలవిసేలా రోదించారు. కాగా, చిన్నారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించి, మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయనతో పాటు భరత్, ఆయూబ్, కొమురెల్లి, మల్లేశం, గంగరాజు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

పెనుగోలులో జరగని సమగ్ర కుటుంబ సర్వే

గుట్టలు దిగి రావాలని కబురు పంపిన అధికారులు

వాజేడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఇప్పటి వరకు జరగలేదు. గుట్టలపై గిరిజనులు నివసిస్తుండటంతో ఇప్పటి వరకు ఎన్యుమరేటర్లు అక్కడికి వెళ్లలేదు. మండలంలోని కొంగాల పంచాయతీ పరిధిలో పెనుగోలు గ్రామం ఉంది. ఇక్కడ 15 ఏళ్ల క్రితం వరకు సుమారు 60 కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం 10 కుటుంబాలు ఉండగా సుమారు 40 మంది ఇక్కడ నివసిస్తున్నారు. పెనుగోలు వెళ్లేందుకు భద్రత కారణాలను అధికారులు సాకుగా చూపిస్తుండటంతో పెనుగోలులో ఇప్పటి వరకు సర్వే జరగలేదు. పూర్తి ఆదివాసీ గ్రామమైన పెనుగోలులో వ్యవసాయ భూములు, సొంత ఇళ్లు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులను పెనుగోలు గిరిజనులు కలిగి ఉన్నారు. గ్రామస్థులు సర్వే కోసం కిందకు దిగి రావాలని సర్వే అధికారులు వారికి కబురు పంపారు. ఈ క్రమంలో వారు కిందకు దిగి వస్తారో.. రారో అనే సందిగ్ధం నెలకొంది. పెనుగోలు వెళ్లి రావడానికి సుమారు 34 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. మూడు గుట్టలు, వాగులను దాటాలి. ప్రస్తుతం పెనుగోలు వెళ్లేందుకు ఎన్యుమరేటర్లు ముందుకు రాకపోవడంతో అక్కడి గిరిజనులు సర్వేకు దూరం అవుతున్నారు. కరోనా సమయంలో అప్పటి ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్క, డీఎంహెచ్‌వో అప్పయ్య, ఇతర అధికారులు పలుమార్లు గుట్టలు ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్యుమరేటర్లు పెనుగోలు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సర్వేను పెనుగోలు సైతం నిర్వహించి అక్కడి గిరిజనులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



గుట్టలు దిగి కాలి నడకన వస్తున్న పెనుగోలు గిరిజనులు (ఫైల్)

ఆహ్లాదం మటుమాయం!

- భూపాలపల్లిలో నిరుపయోగంగా పార్కులు
- పనికిరాని ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- దృష్టి సారించాలని కోరుతున్న వాకర్స్

భూపాలపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్ర వాసులకు ఆహ్లాదం కరువైంది. ఇక్కడి పార్కులు నిరుపయోగంగా మారాయి. పట్టణ ప్రజల కోసం అటవి శాఖ, మునిసిపాలిటీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వకాలంలో అప్పటి ప్రజాప్రతినిధులు రూ.1.75 కోట్లు వెచ్చించి రెండు పార్కులను ఏర్పాటు చేశారు. వాటి ఆలనాపాలనను మరిచారు. నేటికీ ఈ పార్కుల దుస్థితి అలాగే ఉంది. వెంకటేశ్వరనగర్ సమీపంలో ఎకో పార్కును 2020లో రూ. కోటితో నిర్మించగా అందులో వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేసి, మొక్కలు నాటారు. చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఇప్పుడా పార్కు నిరుపయోగంగా మారింది. పిల్లలు ఆడుకునే కొన్ని పరికరాలు, వాకింగ్ ట్రాక్ తప్ప మరెలాంటి వస్తువులు అక్కడ మిగల్లేదు. పార్కు అంతా అడవిని తలపిస్తోంది. పిల్లల పరికరాలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఆదాయం సున్నా

ఈ పార్కు అభివృద్ధి కోసం ఒక్కో వ్యక్తికి రూ.10 వసూలు చేస్తున్నారు. అయితే ప్రధానంగా వాకర్స్‌కు సైతం రూ.10 పెట్టడంతో అటువైపు ఎవరూ కన్నెత్తి చూడ్డం లేదు. పైగా ఆ పార్కులో నిర్మించిన మూడు గద్దెలు పంచాయిలు నిర్వహించుకొనేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. పార్కుకు వాకర్స్ ఎవరూ రాకపోవడంతో. ఆదాయం లేకుండా పోయింది.



ఓపెన్ జిమ్ పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, పాడైన పరికరాలు

జయశంకర్ పార్కులోనూ అదే దుస్థితి

పట్టణంలోని సుభాష్‌కాలనీకి సమీపంలోని జయశంకర్ పార్కును 2016 జూన్‌లో ఏర్పాటు చేశారు. ఒక మురికి కూపంగా ఉన్న ఎకరం స్థలాన్ని అప్పటి తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు వివిధ రకాల మొక్కలు నాటించారు. అలాగే ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల్లోనే అది పనిలేకుండా నిరుపయోగంగా ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పునఃప్రారంభించారు. అయినా ఓపెన్‌జిమ్‌లో పాడైపోయిన పరికరాలను మళ్లీ సరిచేసే నాథులే కరువయ్యారు. దీంతో వాకర్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ, మునిసిపల్ అధికారులు దృష్టి సారించి పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పార్కులో ఎత్తుపల్లాలుగా ఉన్న వాకింగ్ ట్రాక్‌ను సరిచేపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పిచ్చి మొక్కలతో కనిపించకుండా పోతున్న పిల్లల ఆట పరికరం

బీఆర్ఎస్ ధర్నాకు తరలిరావాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్ రావు

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల ఘటనకు నిరసనగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే గిరిజన ధర్నాకు నియోజకవర్గంలోని గిరిజనులు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మానుకోట పట్టణంలో జరిగే ధర్నాకు గిరిజనులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, టీసీ అంజయ్య, ఆర్.వెంకన్న, నాగరాజు, జైసింగ్, శ్రీనివాసరావు, బిందు శ్రీను, కుర్ర శ్రీను, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దవంగర : ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీమంత్రి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం పెద్దవంగరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన గిరిజనుల మహాధర్నా కార్యక్రమంలో గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. మాజీ జీసీసీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచం ద్రయ్యశర్మ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, సమ్మయ్య, వెంకట్రామయ్య, పటేల్, హరీష్, శ్రీనివాస్, వెంకన్న, రవి, భీమానాయక్, బాలు, వెంకన్న, శ్రీను, వీరన్న, గంగాధర్, కుమారస్వామి జనార్దన్, భిక్షపతి, వెంకటేష్, సతీష్, శేఖర్, వెల్మా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న దయాకర్‌రావు

నిత్యం ప్రజలతో బిజీబిజీగా ఉండే ఎర్రబెల్లి దయాకర్‌రావు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిన వారిని కాపాడి మరోసారి మానవత్వం చాటుకున్నారు. మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లుతున్న క్రమంలో తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై శంకర్‌తండా వద్ద పాలకుర్తి మండలం చెన్నూర్ గ్రామ శివారు లావుడ్యా తండాకు చెందిన లావుడ్యా ఇస్తారి, తన కూతురు సబితతో కలిసి ద్విచక్రవాహనంపై హరిపిరాలకు వెళ్లుతున్న క్రమంలో సబిత ఫిట్స్‌తో ద్విచక్రవాహనంపై కిందపడింది. అటుగా వెళ్లుతున్న దయాకర్‌రావు తన వాహనంను ఆపి తక్షణమే వారికి సహాయ చర్యలను అందించి అంబులెన్స్‌లో వారిని ఆస్పత్రికి తరలించారు.

బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రంజిత్



హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం కొత్త అధ్యక్షుడిగా బొమ్మ రంజిత్ నియ మితులయ్యారు. జాతీయ బీసీ సంక్షే మ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఈసీ సం ఘం అధ్యక్షుడు బుట్టి శ్యాందేవ్ సిఫార్సుల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. తనకు పదవి రావడానికి తోడ్పాటు అందించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. క్రిష్ణయ్య, పులి శ్రీనివాస్, బుట్టి శ్యాందేవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని, బీసీ విద్యార్థుల పోరాటాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

రేపు కేయూలో భారత రాజ్యాంగ దినోత్సవ సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. 26న మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఇండియన్ కాన్‌స్టూషన్ అండ్ డెమొక్రటిక్ గవర్నెన్స్: ఏ ప్రాస్పెక్టివ్ అనే అంశంపై సదస్సు జరుగుతుం దని తెలిపారు.

ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వక్తగా కేయూలా కళాశాల రిటైర్డు ప్రొఫెసర్ విజయచంద్రలు హాజరై ప్రసంగిస్తారు. సదస్సుకు ముందు అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులతో కలసి వర్సిటీ మొదటి గేటు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర, అంబేద్కర్ విగ్రహనికి పూల మాలతో నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు చేరుతారు.

వేతనం కోసం 'స్వతంత్ర' పోరాటం

- 2017 నుంచి నేటి వరకు అందని జీతం
- పట్టించుకోని వైద్యాధికారి, అభివృద్ధి కమిటీ
- పరిష్కరించాలని బాధితురాలు వేడుకోలు

కొత్తగూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోజువారి కూలీలు పని అయిపోగానే సాయంత్రం కూలీ డబ్బులు తీసుకుని ఇంటికి వెళతారు. కానీ 8ఏళ్లుగా పని చేస్తున్న ఓ నాలుగో తరగతి ఉద్యోగినికి మాత్రం వేతనం ఇవ్వకుండా వైద్యాధికారులు జాప్యం చేస్తున్నారు. కొత్తగూడ పీహెచ్‌సీలో దోభీగా పని చేస్తున్న స్వతంత్ర అనే మహిళ.. వేతనం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ పోరాటమే చేస్తోంది.

2007నుంచి పీహెచ్‌సీలో పని

కొత్తగూడ మండలకేంద్రానికి చెందిన నాగబెల్లి స్వతంత్ర 2007 నుంచి కొత్తగూడలోని పీహెచ్‌సీలో కాంట్రాక్టర్ పద్ధతిలో దోభీగా పనిచేస్తోంది. తన కుల వృత్తిలో భాగంగా పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలలో సైతం పాల్గొంటోంది. నాలుగు సార్లు మేడారం జాతరలో కూడా పాల్గొని సేవలు అందించారు. జాతరలో కూడా ప్రసవాలు చేశారు. పలువురు అధికారుల నుంచి అభినందనలు పొందారు. స్వతంత్ర చేసిన సేవలకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులచే సన్మానం కూడా పొందారు. అయితే ఈమెకు 2007 నుంచి 2016 వరకు స్వతంత్రకు వేతనం సజావుగా వచ్చింది. తరువాత ఇప్పటివరకు వేతనం అందడం లేదు.

తనతో పాటు వివిధ ఆస్పత్రుల్లో నియామకమైన దోభీలు నెల నెలా వేతనాలు తీసుకుం టున్నారు. స్వతంత్రకు మాత్రం అధికారులు వేతనం ఇవ్వటం లేదు. పలుమార్లు వైద్యాధికారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకుపోయినా స్పందన లేదు. వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికీ విధులకు క్రమం తప్పకుండా హాజరవుతోంది.



కొత్తగూడలో పీహెచ్‌సీ

కాటేసిన క్యాన్సర్ మహమ్మారి

అసలే వేతనం రాక ఇబ్బందులు పడుతున్న స్వతంత్ర.. ఇటీవల క్యాన్సర్ బారిన పడింది. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. ఖర్చుతో కూడుకున్న వైద్యం కావటంతో డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. చికిత్స కోసం అప్పులు చేసి చికిత్స తీసుకుంటోంది. వేతనం వస్తే ఆర్థిక సమస్యలు తీరుతాయని ఎదురుచూస్తోంది.

వేతనం ఇప్పించాలని వేడుకుంటున్నా..



నాగబెల్లి స్వతంత్ర

18 ఏళ్లుగా కొత్తగూడ పీహెచ్‌సీలో పని చేస్తున్నా.. 8ఏళ్లుగా వేతనం రావడం లేదు. దీంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాను. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నాను. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కలెక్టర్, డీఎంహెచ్‌వో స్పందించి వేతనం ఇప్పించాలి.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నేతకానీలు

నేతకానీలకు ఐటీడీఏ పథకాలు అందాలి

రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నికృష్ణ

ఏటూరునాగారం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను నేతకాని కులస్థులకు కూడా అందించాలని నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావిరి చిన్నికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రొయ్యూర్‌లోని నేతకాని కులస్థుల సమావేశం ఆదివారం జరిగింది. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నేతలు నివాళులర్పించారు. పలు డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందచేసి వినూత్న నిరసన తెలిపారు.

అనంతరం సమావేశంలో చిన్ని కృష్ణ మాట్లాడుతూ నేతకానీలు షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులతో కలిసి ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. గిరిజనులకు ఐటీడీఏ ద్వారా పథకాలు అందుతున్నట్లే నేతకాని కులస్థులకు కూడా వర్తింపజేయాలని అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేతకాని కులస్థులను ప్రభుత్వాలు గుర్తించడం లేదని విమర్శించారు. గిరిజనులకు సమానంగా హక్కులు కల్పించే వరకు పోరాడుతామని అన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో నేతకానీలకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య, నాయకులు కావిరి అర్జున్ నరసింహరావు, వెంకటయ్య, మూగన్న, దుర్గం సంపత్ వెంకటేశ్వర్లు, తిరుపతి, ఆకుదారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉసిరిక వనంలో సామూహిక వ్రతాలు



కాటారంలో సామూహిక సత్య నారాయణ వ్రతం చేస్తున్న జంటలు

కాటారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి అటవీ ప్రాంతంలోని ఉసిరిక వనంలో ఆదివారం సామూహిక వ్రతాలు, కార్తీక వనభోజనాలు జరిగాయి. వ్యాపారులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉసిరిక వనంలో దీపారాధన, ధాత్రి నారాయణ పూజలు వైభవంగా చేశారు. పూజలు జరిపిన పండితుడు నిఖిల్‌కు మహిళలు దీపదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు లచ్చిరెడ్డి, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, వీరారెడ్డి, తిరుపతి, మల్లారెడ్డి, వెంకన్న, బాపు రెడ్డి, ఉద్యోగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో...

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసాయి బాబా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు యల్లాప్రగడ భానుప్రకాశ్ శర్మ ఆధ్వర్యంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 30 మంది దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి వస్త్రాలు, గాజులు, కుంకుమలతో వ్రతాలు చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి సతీశ్, కోశాధికారి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరు నాగారం సాయిబాబా ఆలయంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పత్తాలేని ప్లాస్టిక్ నిషేధం

- రికార్డుల్లో అమలు..
- క్షేత్రస్థాయిలో విచ్చలవిడితనం
- నివారణకు పకడ్బందీ కార్యాచరణ

వర్ధన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్ వినియోగం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణానికి విఘాతం ఏర్పడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో వీటి వాడకాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా, ఎక్కడా ఆశించినంత ఫలితం దక్కడం లేదు. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం పురపాలికల్లో పాలిథిన్ నిషేధానికి దశల వారీగా చర్యలు చేపట్టి, పకడ్బందీగా అమలు చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని స్పష్టం చేసింది. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని పేర్కొంది. ఇందులో భాగంగా ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగి, వ్యాపార సంస్థల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగించిన వారికి భారీగా జరిమానాలు విధించనున్నారు. ఈ పరిణామాలతో జిల్లాలోని నాలుగు పురపాలికల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.



ప్రత్యామ్నాయం ఉంటేనే..

గతంలో చాలాసార్లు పురపాలికల్లో ప్లాస్టిక్ నిషేధిస్తు న్నట్లు కమిషనర్లు ప్రకటించారు. తనిఖీలు చేపట్టి దుకాణదారులకు తాఖీదులు ఇవ్వడమే కాకుండా, పాలిథిన్ సం చులను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. వీటి వినియోగంతో జరిగే అనర్థా లపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించినా పరిస్థితులో మార్పు రాలేదు. వీటికి ప్రత్యామ్నాయం లేకపో వడమే ఇందుకు కారణమంటున్నారు. పట్టణా ల్లో ఎక్కడ చూసి నా, ఈ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాలు, మురుగు కాల్వల్లో కవర్లు పేరుకుపోయాయి.

నిబంధనలు పాటించక..

రహదారులపై వ్యాపారాలు కొనసాగించే హోటళ్ల నిర్వాహకులు, చిరు వ్యాపారాలు నిర్వహించే వారు ఎక్కడపడితే అక్కడ చెత్తను పార బోస్తున్నారు. నిబంధనల ప్రకారం సొంతంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాల్లో వేయాల్సి ఉన్నా ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. పోగయ్యే చెత్తను ఉదయం పురపాలిక వాహనాల్లో వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

ఇలా చేయాలని సూచనలు

పట్టణ దుకాణదారులకు, అధికారులు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. దుకాణం ముందు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వాటిల్లోనే వ్యర్థాలను వేయాలి, నిత్యం వచ్చే మునిసిపల్ ట్రాక్టర్, రిక్షాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి వేయాలి.

ఇందుకోసం ఇళ్లలో రెండు వేర్వేరుగా బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, చెత్త ఎక్కడపడితే అక్కడ వేసినా జరిమానా విధిస్తారు. హోటళ్లలో, టీ దుకాణాలు, తినుబండారాల తయారీదారులు, దాబాల యాజమానులు ప్లాస్టిక్ వాడొద్దు అన్నారు.

తాజాగా ఆదేశాలు

120 మైక్రాన్లకంటే మందం తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగించవద్దని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 120 మైక్రాకన్‌ల కంటే మందం తక్కువ మైక్రాన్లు ఉన్నవి, ఒకసారి వాడినవి ఉన్నా, నిల్వచేసినవి ఉన్నా, విక్రయించినా ఉపయోగించిన ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్టు 1986 ప్రకారం సిడీఎంఎ హై దరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామగ్రి జప్తు, రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా, లైసెన్స్ రద్దుతోపాటు చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రజల సహకారం అవసరం

సుధీర్‌కుమార్, మునిసిపల్ కమిషనర్, వర్ధన్నపేట



ప్లాస్టిక్ వ్యర్థాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సహకారం అవసరం. దుకాణదారుల్లో కొంతమందికి నోటీసులు సైతం జారీ చేస్తున్నాం. ఖచ్చితంగా నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దశలవారీగా చర్యలు తీసుకుంటాం. గతంలో మాదిరి కాకుండా పకడ్బందీగా వ్యవహరిస్తాం.

పర్యాటక స్థలాలను చూసొద్దాం..

'తెలంగాణ దర్శిని'తో విద్యార్థులకు అవకాశం

- పర్యాటక ప్రాంతాలపై అవగాహనే లక్ష్యం
- విద్య, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమలు
- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 12 వేల మందికి లబ్ధి
- హనుమకొండ జిల్లాలో శ్రీకారం

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో విద్యార్థులకు విహారయాత్రలు (ఎక్స్‌కర్షన్) ఉండేవి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలే విద్యార్థుల నుంచి నామ మాత్రపు ఫీజు వసూలు చేసి విహారయాత్రలకు తీసుకెళ్లేవి. విహారయాత్ర అంటే విద్యార్థులకు ఎక్కడి లేని ఉత్సాహం వచ్చేది. తల్లిదండ్రులు వారించిన విహారయాత్రకు వెళ్తామని మారాం చేసి డబ్బులు వసూలు చేసుకొని వెళ్లేవారు. ఇది ఒకప్పటి మాట. తర్వాత కాలంలో ప్రైవేటు విద్యా సంస్థలు ర్యాంకుల గోలలో పడి, ప్రభుత్వ విద్యా సంస్థలు నిధులు లేక ఖర్చుకు భయపడి విద్యార్థులను విహారయాత్రలకు తీసుకువెళ్లడం మానివేశాయి.



విహారయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య (ఫైల్)

ఇప్పుడు విద్యార్థులు విహార యాత్రలకు వెళ్లే అవకాశాన్ని 'తెలంగాణ దర్శిని' పేరుతో ప్రభుత్వం కల్పిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థుల వరకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో వారిని ఉచితంగా విహార యాత్రలకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపట్టింది.

వారసత్వాన్ని తెలుసుకునేందుకే..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, నిధులను ప్రభుత్వం ఖరారు చేసింది.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షల నిధులను విడుదల చేసింది. తెలంగాణ దర్శిని కింద ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 12వేల మందికిపైగా విద్యార్థులు విహారయాత్ర చేసే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

తరగతుల్లో నాలుగు విభాగాలు

విద్యార్థుల తరగతుల ప్రకారం నాలుగు విభాగాలుగా విభజి స్తారు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రామం లేదా మండల పరిధిలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, ఉద్యాన వనాలను సందర్శించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ పరిధిలోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు 50-70 కి.మీ పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు కార్యక్రమం రూపొందిస్తారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించే అవకాశం కల్పిస్తారు. 2-4 తరగతి విద్యార్థులకు ఒక రోజు పర్యటన కోసం ఒక్కో విద్యార్థిపై రూ 300, 5-8 తరగతి విద్యార్థులకు ఒక రోజు పర్యటనకు రూ.800, తొమ్మిది నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు రెండు రోజుల పర్యటనకు రూ. 2వేల చొప్పున డిగ్రీ విద్యార్థులకు నాలుగు రోజుల పర్యటనకు రూ. 4వేల చొప్పున ఖర్చు చేస్తారు. విద్యార్థుల భద్రత, పర్యటనను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు కావాల్సిన రవాణాను టీఎస్ఆర్టీసీ సమకూరుస్తుంది. విద్యార్థుల భద్రత, రవాణాను కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు బాధ్యత వహిస్తారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు, సమన్వయాధికారులు ఉంటారు.

యువ టూరిజం క్లబ్బులు

తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఏడు నుంచి 12వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులతో ఏర్పాటైన ఈ క్లబ్బులు విహార యాత్రల నిర్వహణలో తోడ్పాటు అందిస్తాయి. పర్యటనకు వచ్చే విద్యార్థులను సమీకరించడం, విహార యాత్ర సందర్భంగా వారిని కనిపెట్టుకొని ఉండడం, దర్శనీయ స్థలాల గురించి వారికి వివరించడం వారి బాధ్యత. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటు పూర్తయింది.

ఈ క్లబ్బులు ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పని చేస్తాయి. ప్రతీ క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ యువ టూరిజం క్లబ్బులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.

మర్కజీ విద్యార్థులతో శ్రీకారం

ఎకో టూరిజం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శిం చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దసరా సెలవుల తర్వాత ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయిం చినా ఒక్క హనుమకొండ జిల్లా తప్పా మిగతా జిల్లాల్లో ఇంకా మొదలు కాలేదు. హనుమకొండలోని మర్కజీ విద్యార్థులు ఇటీవల తెలంగాణ దర్శిని పథకంలో భాగంగా వరంగల్‌లోని పర్యాటక ప్రాంతాలను దర్శించారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్య, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో హనుమ కొండ ప్రభుత్వ మర్కజీ పాఠశాల విద్యార్థులు పర్యాటక ప్రదేశా లకు వెళ్లే బస్సును కలెక్టర్ ప్రావీణ్య జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ఖిలా వరంగల్, కుష్‌మహల్, పురావస్తు మ్యూజియం, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. విద్యార్థుల వెంట ఉన్న గైడ్ దర్శనీయ స్థలాల గురించి వివరించారు.

చారిత్రక ప్రాంతాలపై అవగాహన

వాసంతి, డీఈవో హనుమకొండ



తెలంగాణ దర్శిని ద్వారా విద్యార్థులకు చారిత్రక ప్రాంతాలను ఉచితంగా చూసే అవకాశం కలుగు తుంది. తద్వారా విద్యార్థులు ఆ ప్రాంతాల గొప్పతనం, తెలంగాణ వారసత్వం, సంస్కృతి, సంప్రదా యాలను తెలుసుకుంటారు. వార సత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అవుతారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని విద్యార్థులు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటక శాఖ సమన్వయంతో ప్రణాళికలను రూపొందించి అమలు చేయనున్నాం.

దర్శనీయ స్థలాల సందర్శన

శివాజీ, హనుమకొండ జిల్లా పర్యాటక అధికారి



విద్యార్థులకు తరగతి గది వెలుపల అభ్యాస అనుభవాన్ని తెలంగాణ దర్శిని అందిస్తుంది. తెలంగాణ వారసత్వం, చారిత్రక కట్టడాలు అపురూపమైనవి, దర్శనీయ స్థలాల గురించి విద్యార్థులకు తెలియజేయడమే ఈ పథకం ఉద్దేశ్యం. మన వారసత్వ సంపద, వాటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది.

చలి మోత.. చెరువులో ఈత

- ఆరోగ్యం కోసం వింటర్‌లోనూ స్విమ్మింగ్
- వేకువజామునే ఉత్తమ వ్యాయామం
- వరంగా మారిన వెంకటగిరి చెరువు

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు గజగజవణికిస్తూ చలి మోత మోగిస్తోంటే.. మరోవైపు చెరువులో ఈత కొడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు కొందరు గ్రామస్థులు. అన్ని వ్యాయామాల్లో ఈత ఉత్తమమైందని వైద్యులు చెబుతుంటారు.

ఇలా ఈత కొట్టేందుకు స్వచ్ఛమైన నీటితో కేసముద్రం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని కాకతీయుల నాటి వెంకటగిరి గ్రామ 'సూరారం' చెరువు అందుబాటులో ఉండడం నిజంగా 'సూర్యుడి వరం'గానే చెప్పవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూక్తిని ఒంటబట్టించుకుని కొంత మంది యువకులు, పెద్దలు ప్రతీరోజు వేకువజామునే ఈత కొట్టడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ చలికాలంలో సైతం కేసముద్రం స్టేషన్‌కు చెందిన సుమారు 20 మంది ప్రతీరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు పలు బ్యాచ్‌లుగా సూరారం చెరువులో ఈతకు వెళుతున్నారు.



సూరారం చెరువులో ఈత కొడుతున్న కేసముద్రం వాసులు

ఈ చెరువులో నీళ్లు ఎలాంటి కలుషితం లేకుండా స్వచ్ఛంగా ఉంటాయని 15 నుంచి 22 ఏళ్లుగా నిత్యం ఈత కొడుతున్న కరివేదుల కృష్ణారెడ్డి, పెరుమాండ్ల గుట్టయ్య, తాళ్లపెల్లి కృష్ణమూర్తి, మారగాని గోవర్దన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరు నాయక్, ముంజ భిక్షపతి, దేశబోయిన సుధాకర్, బెజ్జం ప్రేమ్‌కుమార్, రవీంద్రాచారి, తుమ్మ పరమేశ్వర్, పాషా, కుసుమ కిరణ్, కంచు కుమారస్వామి తదితరులు తెలిపారు. కేసముద్రం స్టేషన్ నుంచి కాలినడకన కొందరు, మరికొందరు సైకిళ్లపై, మోటార్‌సైకిళ్లపై చెరువు వద్దకు చేరుకొని, సుమారు గంటన్నరపాటు ఈత కొట్టి ఆ తర్వాత ఇంటికి వెళ్తారు.

ఆహ్లాదకర వాతావరణం..

నిత్యం వివిధ పనుల ఒత్తిడితో ఉండే వారు ప్రభాతవేళ వెంకటగిరి చెరువువైపునకు వచ్చి పచ్చనిపొలాలు, పక్షుల కిలకిలా రావాలను ఆస్వాదిస్తూ ప్రశాంతత పొందుతున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా వాహనాల రాకపోకలు ఉండవు కాబట్టి శబ్ద, వాయు కాలుష్యం సైతం ఉండదు. ఇక ఈత కొట్టే వారిలో సంఘాలు ఏర్పాటు చేసుకొని అలుగు పోసినప్పుడు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెంకటగిరి చెరువు వ్యాయామం చేసేవారికి ఒక వరంలా మారిందని పలువురు ఈతకొట్టేవారు తెలిపారు. ఇక చలిలో ఈత మరో అనుభూతిని ఇస్తుందని వారు చెబుతున్నారు. నీళ్లలోకి దిగిన ఒక నిమిషంపాటే చలి అనిపిస్తుందని, ఆ తర్వాత శరీరం ఆ నీటికి అనుకూలంగా మారిపోతుందని చెబుతున్నారు. ఈత వల్ల సమయానుకూలంగా ఆకలి, నిద్ర కొనసాగుతూ శరీర గడియారం సక్రమంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏదేమైనా ఉదయమే శారీరక, మానసిక ప్రశాంతత కోసం వెంకటగిరి చెరువు వద్దకు ఈతకు వెళ్లడం వారికి ప్రతీరోజు ఒక కొత్త అనుభవాన్ని ఇస్తుంది.

22 ఏళ్లుగా ఈత కొడుతున్నా..

కరివేదుల కృష్ణారెడ్డి, కేసముద్రం స్టేషన్



ఈ చెరువులో 22 ఏళ్లుగా నిత్యం ఈత కొడుతున్నాను. నీళ్లలోకి దిగిన ఒక నిమిషం వరకే చలి ఉంటుంది. ఆ తర్వాత శరీర ఉష్ణోగ్రత చెరువు నీటికి అనుకూలంగా మారుతుంది. ఈత కొట్టడం వల్ల రోజంతా వివిధ పనుల్లో ఉండే ఒత్తిడి దూరమైన మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుంది. ఈత వల్ల ఎముకలపై ఒత్తిడి పడకుండా శరీరంలో ఉండే కొవ్వును కరిగించి, దృఢంగా చేస్తుంది. ఈ చెరువు మాకు అందుబాటులో ఉండడం మా అదృష్టం.



వరంగల్ కోటలో 3 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 3కే రన్

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఖిలా వరంగల్‌లో ర్యాలీ

ఖిలావరంగల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందని ఎస్ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కొప్పుల రవీందర్ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్‌లో ఎస్ఆర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చింతల్‌నుంచి మధ్యకోట శిల్పాల మీదుగా మెట్టుకోట వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 3కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నిడిపించేందుకు ఎన్ఎస్ఎస్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో 70 మంది ఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోటలో పర్యాటకుల సందడి..

ఖిలావరంగల్ మధ్యకోట ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రపంచవారసత్వ వారోత్సవాలలలో భాగంగా వరంగల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి మల్లేశం పర్యవేక్షణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పిల్లల పార్కులో గౌడ సంఘం కార్తీకమాస వన భోజనాలు, వాకింగ్ గ్రౌండ్‌లో పద్మశాలి వనభోజనాలు ఉండడంతో పాటు వరంగల్ నగరంలోని వివిధ కళాశాల, పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులతో కోటలో సందడి కనిపించింది.

వైవిధ్యం.. వీరన్న పూజా విధానం

- స్వామి వారికి నారికేళాలు, అమ్మవారికి జంతు బలులు
- శివరాత్రి నుంచి నెల రోజుల పాటు జన జాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పాలించిన భీమరాజు
- కాకతీయుల కళాపిపాసకు ఆనవాళ్లు ఆలయ చరిత్ర

మహబూబాబాద్ జిల్లాలోని కురవి దేవాలయం



ప్రాశస్త్యం



గుడిలో భద్రకాళి సమేత వీరభద్రుడు

మహబూబాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందుతూ.. వీర వనితలైన సమ్మక్క-సారలమ్మ తల్లులే దేవతలుగా కొనియాడబడే మేడారం గిరిజన జాతర తర్వాత రెండో స్థానంలో నిలుస్తున్న రుద్రమదేవి కొలిచిన వీరభద్రేశ్వరస్వామి కురవీరన్న జాతర మహబూబాబాద్ జిల్లాలో గిరిజన, గిరిజనేతర భక్తులతో నిత్యం కళకళలాడుతోంది. కోరిన వారికి కోటి వరాలిచ్చే ఇలవేల్పుగా కొనియాడబడుతున్న శ్రీభద్రకాళి సమేత కురవి వీరభద్రస్వామి దేవాలయం వైవిధ్య భరితమైన సంప్రదాయాలతో విలసిల్లుతోంది. భద్రకాళి సమేత వీరభద్రుడిగా భక్తుల కోర్కెలు తీర్చే దైవాలుగా ఏటేటా మహాశివరాత్రి నుంచి నెల రోజులపాటు నిర్వహించుకునే జాతర ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ ఆలయంలో పూజలు వైవిధ్యంగా జరగడం విశేషం. ఆలయ ప్రాంగణంలో శ్రీవారైనా వీరభద్రుడికి మాత్రం నారికేళా (కొబ్బరికాయ)లు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం అనవాయితీ కాగా, ఆలయానికి వెలుపల నిర్మించిన ప్రహరీ వెలుపల భద్రకాళి అమ్మవారికి జంతు (కోళ్ల, యాటపోతుల) బలులతో మొక్కులు తీర్చుకోవడం అనాదిగా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి నెల రోజుల పాటు కొనసాగే జాతరకు భారీగా తరలివచ్చే భక్తజనం మొక్కులు కూడ వైవిధ్యంగానే ఉంటాయనడానికి ఈ ఆలయమే నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రులుగా కొనసాగిన చంద్రబాబు, దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిలతో పాటు తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే బంగారు మీసాలు సమర్పిస్తానని మొక్కుకున్న పూర్వ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ ఆలయాన్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు విడతల వారీగా మంజూరి ఇచ్చారు.

చారిత్రక ప్రాధాన్యతతో కురవి

కురవి ఒకప్పుడు మహోన్నత దశను అందుకున్న నగరంగా పేరుగడించింది. క్రీ.శ 850 ప్రాంతంలో తూర్పు చాళుక్యులతో ముఖ్యుడైన గునగ విజయాధిత్యుడు వేంగి (ఏలూరు)ను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. వేంగి చాళుక్యుల కాలంలో చోళరాజులతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఇందుకు నిదర్శనంగానే రాజరాజ చోళుని కుమార్తెను రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న విమలాధిత్యుడు వివాహం చేసుకున్నట్లు చరిత్ర పేర్కొంటోంది. సదరు విమలాధిత్యుడు కుమారుడే రాజరాజనరేంద్రుడు ఆ కాలంలో తమిళ దేశపు ద్రావిడ సంస్కృతిని ప్రతిబింబించే విశిష్టాద్వైత ప్రబంధాలు వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ్య ఆంధ్రీకరించాడు. ఈ నేపథ్యంలోనే అనేక తెలుగు కుటుంబాలు తమిళ దేశానికి తరలివెళ్లాయి. అప్పట్లోనే వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజులలో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమరాజు ప్రస్తుత ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఆ కాలంలోనే శ్రీ వీరభద్రేశ్వరి కురవి ఆలయాన్ని నిర్మించినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన 1వ బేతరాజు పునరుద్ధరించారు. తరువాత కాలంలో రెండో బేతరాజు కురవి చెరువును తవ్వించినట్లు అనేక ఆధారాలు ఉన్నాయి. తూర్పు చాళుక్య రాజైన శ్రీవీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్లు విదేశీ యాత్రికుడు మార్క్‌పోలో తన రచనల్లో పేర్కొన్నాడు. శ్రీ వీరభద్రుడి దేవాలయం చుట్టు కురవి పట్టణప్రాంతం ఏర్పడినట్లు వేంగి చాళుక్యుల రెండవ రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి సాహితీ సాంస్కృతిక రంగాల్లో ఎనలేని వైభవాన్ని చవి చూసినట్లు చరిత్ర చెబుతోంది.

తొలుత స్వామి ఒక్కడే..

కురవిలో తొలుత వీరభద్రస్వామి ఒక్కరే ఉండేవారని, సుమారు 150 ఏళ్ల కిందట భక్తులు తాము చేసిన తప్పొప్పులను ఆలయ ప్రాంగణంలోకి రాగానే వీరభద్రుడే పూనకాల ద్వారా భక్తుడి నోటివెంట నిజాలు చెప్పించేవారని నమ్మకాలు ఉండేవని చెబుతున్నారు. దీంతో అనేక కుటుంబాలు విడిపోవడం లాంటి అనర్థాలు జరిగాయట. ఆ క్రమంలోనే ఉగ్రరూపుడైన వీరభద్రుడి రౌద్రాన్ని తగ్గించడానికి అమ్మవారిని తీసుకురావాలనే ఆలోచన భక్తులకు కలిగిందట.. ఫలితంగా భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇదే ఆలయంలో వీరభద్రుడి పక్కన ప్రతిష్ఠించారని ప్రతీతి. అప్పట్నుంచి ప్రతిశివరాత్రి ఈ ఇరువురికి కల్యాణం జరుగుతోంది. అయితే తనకు నారికేళాలు కాదని, బలులు కావాలని, ప్రత్యేక ఆలయం కట్టించాలని ఓ భక్తుడి కలలో అమ్మవారు కన్పించి కోరిందంట. ఆపై వీరభద్రుడి ఆలయానికి సమీపంలోనే ప్రత్యేకంగా భద్రకాళి ఆలయాన్ని నిర్మించారు. ఈ అమ్మవారు స్వయంభూ అవతారమన్న వాదన కూడా ఉంది. ఏదేమైనా అప్పట్నుంచే ఇటు వీరభద్రుడికి నారికేళాలు సమర్పించుకునే భక్తులు.. భద్రకాళి అమ్మవారి ప్రత్యేక ఆలయంలో జంతు బలులు ఇస్తూ వస్తున్నారు.

చరిత్ర పుటల్లో కురవి వీరన్న..

ప్రాచీనాంధ్ర చరిత్రలో కాకతీయ ప్రభులది ప్రత్యేక స్థానం ఉందనడంలో అతిశయోక్తి లేదు. కాకతీయుల సామ్రాజ్యం అత్యంత వైభవంగా వెలుగొందిన 12వ శతాబ్దంలో కాకతీయుల కళాపిపాస, కళల పోషణ అభిరుచికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి, ఇలాంటి దేవాలయాలు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఈ కోవలోనిదే.. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం. పుణ్యక్షేత్రాలతో విలసిల్లుతూ.. ఈ మండలం చారిత్రక పర్యాటక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ కురవి ఆలయాన్ని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఏటేటా తరలివస్తున్నారు. సికింద్రాబాద్, విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో కురవి ఉంది.

మొక్కలు నాటిన మంత్రి సీతక్క



మొక్కను నాటుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంత్రి సీతక్క ఆదివారం పర్యటించారు. 163వ జాతీయ రహదారి డివైడర్ మధ్య అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కలెక్టర్ దివాకర, డీపీవో దేవరాజ్, ఎంపీడీవో సుమనవాణి, ఎంపీవో శ్రీధర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గ్రామ కార్యదర్శి రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓకారు ఢీకొనడంతో అతడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి లోని మంజూర్‌నగర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలంలోని గొల్లపల్లికి చెందిన మిట్టపెల్లి కొమురయ్య (52) మంజూర్‌నగర్‌లోని 8 ఇన్‌క్లైన్ వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా పరకాల వైపు నుంచి భూపాలపల్లికి వచ్చే కారు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గతంలో వాచ్‌మన్‌గా పనిచేయగా ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నాడు.

ఊపందుకున్న పత్తి కొనుగోళ్లు

- జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలు
- 47,305.55 మెట్రిక్ టన్నుల సేకరణ
- దళారులను పట్టించుకోని అధికారులు



చిట్యాల సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేసిన పత్తి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఈనెల 4 నుంచి ఇప్పటి వరకు 47,305.55 మెట్రిక్ టన్నులను సేకరించారు. జిల్లా పరిధిలోని చిట్యాల మండల కేంద్రంలో రెండు మిల్లుల నుంచి రెండు సెంటర్లు, అలాగే కాటారం మండలంలో రెండు మిల్లుల నుంచి రెండు సెంటర్లను ఏర్పాటు చేసి పత్తిని కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 98వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధి కారులు అంచనా వేశారు. గత ఏడాది క్వింటాకు సుమారు రూ.12 వేల వరకు ధర ఉండగా ఈసారి ప్రభుత్వం రూ.7521 మద్దతు ధర ప్రకటించింది.

నిబంధనలతో ఇక్కట్లు..

పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వం పెట్టిన నిబంధనలు సీసీఐ వ్యాపారులతో పాటు దళారులకు కలిసొస్తుండగా పలువురు రైతులకు మాత్రం ఇక్కట్లు తప్పడంలేదు. తేమ 12 శాతం లోపు ఉండి, గింజపొడవు 29.5 లేదా 30.5 మి.మీ, మైక్రోనీర్ విలువ 3.6 నుంచి 4.3 మధ్య ఉంటేనే మద్దతు ధర చెల్లించాలనే నిబంధన ఉంది. తేమ శాతం, గింజ పొడవు ఏ మాత్రం అటు ఇటు అయినా ధరలో కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అన్ని బాగున్నా ఏదో ఒక సాకుతో రూ.7వేలకు మించి చెల్లించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక తేమ శాతం గరిష్ఠంగా 8 శాతం, కనిష్ఠం 12 శాతం దాటితే మిల్లుకు తీసుకెళ్లినా విక్రయించలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు హమాలీ చార్జీల పేరిట రైతుల నుంచి కొంత మంది సీసీఐ కేంద్రాల నిర్వాహకులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జోరుగా దళారుల దందా

పత్తి విక్రయాలు ఊపందుకోవడంతో దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతగా పత్తి సేకరించిన రైతుల నుంచి అనాధికారికంగా కొనుగోళ్లు చేస్తున్నారు. దర్జాగా గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తూ రైతులను మోస గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల జిల్లా పరిధిలోని చిట్యాల మండలంలోని గోపాలపురంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజడుగు గ్రామానికి చెందిన ఓ దళారి తూకంలో మోసాలకు పాల్పడటాన్ని ఆ గ్రామ రైతులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. చాలా మంది దళారుల్లో కొంత మంది గ్రామాల్లో తిరుగుతుండగా మరికొంత మంది ఏకంగా అనధికారిక షాపులను ఏర్పాటు చేసుకొని దర్జాగా కొనుగోళ్లు చేస్తూ లబ్ధిపొందుతున్నారు. కాటారం మండల పరిధిలో ఓ దళారి షాపు ఏర్పాటు చేసుకొని ఈ తరహా దందా జోరుగా సాగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వ్యవహారం మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టిలో ఉన్నా చర్యలకు వెనుకాడటంలో ఆంతర్యమేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా కొనుగోళ్లు చేస్తున్న వారిని గుర్తించడంలో గానీ, తగిన చర్యలు తీసుకోవడంలో గానీ సంబంధిత శాఖ దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

తిప్పలు పడలేక..

సీసీఐలో నెలకొన్న నిబంధనలతో రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దళారులు అడిగిన ధరకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6వేల లోపే చెల్లిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు చివరి కావడంతో మంచు అధికంగా కురుస్తోంది. ఈ క్రమంలో విక్రయించే పత్తిపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నా తేమ శాతం పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం అధికమైతే సీసీఐ కేంద్రాల నిర్వాహకులు వెనక్కి పంపుతుండటంతో చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తోందంటున్నారు.

ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలి



రైతుల సౌకర్యార్థం నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. తేమ శాతం అధికంగా లేకుండా చూసుకోవాలి. దళారులెవరినీ ఆశ్రయించొద్దు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు అనధికారికంగా పత్తి కొనుగోళ్లు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు సీసీఐ కేంద్రాలు నడిచేలా ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నాం. పత్తి విక్రయాల్లో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలి.

\- కనుక శేఖర్, జిల్లా మార్కెటింగ్ అధికారి

రామప్పలో పర్యాటకుల సందడి



రామప్ప ఆలయంలోకి వెళ్తున్న పర్యాటకులు

వెంకటాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, పాఠశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో రామప్పకు చేరుకున్నారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ శిల్పకళా సంపదను పరిశీలించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే సహించం : కాంగ్రెస్

మహాముత్తారం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబును అనవసరంగా విమర్శిస్తే సహించబోమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పక్కల సడువలి అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పదేళ్ల కాలంలో మంథని నియోజకవర్గానికి చేసిందేమీ లేదని అన్నారు. మంత్రిగా శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధిని ఓర్వకనే ఇలాంటి నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముక్కెర రాజమల్లు, వంశీ, రాజునాయక్, మోత్కూరి రవి, మల్లయ్య, అట్టెం రమేష్, ఎల్. రాజు, సుధకార్‌గౌడ్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి

మల్హర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు నిబంధనలకు లోబడి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ గౌడ్ అన్నారు. మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ వద్ద మండల అధ్యక్షుడు కుక్కుడపు అశోక్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో సంపత్ మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దని అన్నారు. గ్రామీణ వైద్యులు ఐక్యంగా హక్కుల సాధనకు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దుబాసి బాలరాజు, చెవురి రాజేందర్, చింతల కుమార్‌యాదవ్, ముడుతనపల్లి ప్రభాకర్, శ్రీనాథ్, భూమయ్య, రాజయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ, రమేష్, తిరుపతిరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా బీటీ రోడ్డు పనులు

కాటారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ-గంగారం మధ్య గొల్లపల్లి, రేగులగూడెం, బూడిదపల్లి మీదుగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.3 కోట్లనిధులను బీటీ రోడ్డు నిర్మాణం కోసం మంజూరు చేయించారు. దశాబ్దాల క్రితం ఉన్న దారి బీటీ రోడ్డుగా మారుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

గణపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాడిచెట్టు నుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి ఓ గీత కార్మికుడు గాయపడ్డాడు. మండల కేంద్రంలో ఈ సంఘటన ఆదివారం జరిగింది. తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మోటపోతుల ప్రశాంత్ రోజూవారీ మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలు జారి కిందపడ్డాడు. దీంతో గమనించిన తోటి కార్మికులు వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

'చలో హైదరాబాద్'కు తరలివెళ్లాలి : ఎమ్మార్పీఎస్

వాజేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేయూత పింఛన్లను పెంచుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలో వచ్చిన అనంతరం మాట తప్పిందని విమర్శించారు. దివ్యాంగులకు రూ. 4,016 నుంచి రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛను రూ. 4,016 చెల్లిస్తామని చెప్పి పాతదాన్నే అమలు చేస్తోందని ఆరోపించారు. పింఛన్ల సాధనకు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ అధ్యక్షుడు రాకేష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు లేగల రవి, బలుసుపాటి స్వామి, సమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల వనభోజనాలు

వెంకటాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం ప్రాజెక్టు సమీపంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు చిన్నాపెద్దా అనే తేడాలేకుండా పాటలు పాడుతూ ఆటలాడి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ఉసిరిచెట్టుకు మహిళలు పూజలు నిర్వహించారు. సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి ధనపనేని వెంకటేశ్వర్లు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి పిట్టల మధు, భద్రాచలం నాయకులు రాజశేఖర్, ధనపనేని నాగరాజు, బెజ్జని సత్తిబాబు, జక్కుల శ్యామ్, జొన్నల నాగేశ్వర్‌రావు, దాసరి నారాయణరావు, సత్యనారాయణ, మురళి, తోట శ్రీను, కూసం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన ఇల్లు

వెంకటాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని చొక్కాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మచ్చ రవితేజ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్థులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ కమిటీల ఎన్నిక

భూపాలపల్లిటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల రీజియన్, డివిజన్ కమిటీలను ఆదివారం ఆ సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందం తెలిపారు. భూపాలపల్లిలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఈ కమిటీలను ఎన్నుకున్నారు. రీజినల్ అధ్యక్షుడుగా ఎం.మధూకర్, రీజినల్ కార్యదర్శిగా డి.రాంచందర్, భూపాలపల్లి డివిజన్ అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, కార్యదర్శిగా మచ్చ సత్యంను ఎన్నుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

చిట్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి భూపాలపల్లి కోర్టు జడ్జి రామచంద్రరావు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 11 మందిని కోర్టులో హాజరుపర్చగా రవి, సాయికి జైలు శిక్షతో పాటు మిగతా వారందికీ జరిమానా విధించినట్లు వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి 200 శాతం కంటే ఎక్కువ ఆల్కాహాల్ రీడింగ్ చూపిస్తే రూ. వెయ్యి జరిమానా, రెండు రోజులు జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు.

26న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

మంగపేట, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో ఈనెల 26న బీఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి సీతక్కతోపాటు అటవీ ఉత్పత్తుల కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హాజరు కానున్నారని సంఘం మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు బసరికాని హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

గణపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని గాంధీనగర్ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీసాకు చెందిన కలుకోట మనోజ్ తన కుటుంబంతో కలిసి గణపురంలోని బంధువుల ఇంటికి వస్తున్నారు. గాంధీనగర్ దాటి వస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతను గమనించలేదు. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. వెంటనే కారు బెలూన్లు ఓపెన్‌కావడంతో మనోజ్‌తో పాటు కారులో ఉన్న ముగ్గురికి ప్రాణాపాయం తప్పింది. స్వల్ప గాయాలు కావడంతో వారిని హనుమకొండకు తరలించారు.

ఏవీవీపీఎస్ మండల కన్వీనర్‌గా రంజిత్

భూపాలపల్లిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి (ఏవీవీపీఎస్) భూపాలపల్లి మండల కన్వీనర్‌గా కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామానికి చెందిన తరాల రంజిత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రూరల్ జిల్లా కన్వీనర్ ముద్దమల్ల భార్గవ్ ప్రకటించారు. కోకన్వీనర్లుగా బాణాల రమేష్, గుండు శ్రావణ్, మద్రి రాజు, విజయ్, బాబు, శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



రమేష్ కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్యకు గురైన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్, ఆయన సోదరుడు ఉయిక అర్జున్ కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. బాధిత కుటుంబాలను ఆయన ఆదివారం పరామర్శించారు. రమేష్, అర్జున్ భార్యాపిల్లలను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందే పరిహారంతోపాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు మంత్రులు, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్కతో మాట్లాడి పరిహారం తొందరగా విడుదలయ్యేలా కృషి చేస్తానన్నారు. మృతుల పిల్లల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసాను ఇచ్చారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం ఇరు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు. అదే సమయంలో స్థానిక పెనుగోలుకాలనీ వాసులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. గుట్టలు దిగి వచ్చినప్పటి నుంచి తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయటంలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కాలనీలో మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గుట్టలు దిగి వస్తే వ్యవసాయ భూములు ఇస్తామని, మిగిలిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు మాటను నిలబెట్టుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్‌వర్మ, సీనియర్ నాయకులు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, నాయకులు కాకర్లపూడి కల్యాణ్‌వర్మ, చెన్నం ఎల్లయ్య తదతరులు ఉన్నారు.

సర్వే డేటా ఎంట్రీ కీలకం

- వీడియో కాన్ఫరెన్స్‌లో

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ములుగు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో డేటా ఎంట్రీ చాలా కీలకమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డోర్‌లాక్, వలస వెళ్లినవారి వివరాలు ఫోన్‌కాల్ ద్వారా సేకరించాలని ఆదేశించారు. ఆదివారం ఆయన ఝార్ఖండ్ రాజధాని రాంచి నుంచి కలెక్టర్ టీఎస్.దివాకరతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైనదని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని అన్నారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటివద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తినందున వారికి ఫోన్‌చేసి అందుబాటులో ఉండాలని కోరి, సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వెళ్లిన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అవుతున్నాయని, పాఠశాలల్లో ఆహారం, పరిశుభ్రతపై సీఎం రేవంత్‌రెడ్డి, కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించిందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ పాయిజన్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని ఆయన తెలిపారు. త్వరలోనే ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావులేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ ములుగు జిల్లాలో 97,552 ఇళ్లను సర్వే కోసం గుర్తించామని, ఈనెల 23 నాటికి మొత్తం 97,552 ఇళ్ల సర్వే పూర్తయిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం సర్వే పూర్తి చేసినట్లు ఉపముఖ్యమంత్రికి వివరించారు. డేటా ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లను గుర్తించామని, పక్కాగా నమోదు చేస్తున్నామని అన్నారు.

'లగచర్ల'పై ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటాలు

(5వ పేజీ తరువాయి)

గిరిజనులకు ఎంతో మేలు చేసిందని, తండాలను జీపీలుగా చేయడంతో పాటు 10శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. మహబూబాబాద్‌లో సోమవారం జరిగే ధర్నాలో ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం ఎందుకు స్పందించడం లేదు..

లగచర్లలో గిరిజనులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రాహుల్‌గాంధీ జోడోయాత్ర, రేవంత్‌రెడ్డి పాదయాత్రకు అనుమతిచ్చామని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ధర్నాలు చేసే, సభలు పెట్టుకునే హక్కు ఉంటుందని, అది అధికార కాంగ్రెస్‌కు తెలవకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా నిర్వహిస్తామని అనుమతి కోరితే ప్రభుత్వం అడ్డుకుందని, హైకోర్టును ఆశ్రయిస్తే అనుమతిచ్చిందని, ఇది ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని చెప్పారు. మాజీ మంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ మాట్లాడుతూ... లగచర్లలో గిరిజనులపై దాడి దుర్మార్గమైన చర్య అని అన్నారు. మానుకోట మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ.. లగచర్ల రైతులకు మద్దతుగా ఈ నెల 25న మానుకోటలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా ఉంటుందని, అన్నివర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు భయపడి సీఎం రేవంత్‌రెడ్డి యూటర్న్ తీసుకున్నారని అన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం కాదని, పారిశ్రామిక కారిడర్‌ను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించే ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అంగోతు బిందు, మునిసిపల్ ఛైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసిన ట్రస్ట్ చైర్మన్



మంత్రికి జ్ఞాపకను అందిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

మంగపేట, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వినయ్ కుమార్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాశిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపికను బహూకరించారు. ఆయన వెంట పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మణుగూరు కాంగ్రెస్ నాయకులు మైత్రి వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు 'అదనపు' బాధ్యతలు!

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా కూడా ఆయనకు బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణలో కలెక్టర్ రాహుల్‌శర్మకు మయాంక్‌సింగ్ చేదుడువాదోడుగా ఉంటున్నారు. దీంతోపాటు కాటారం సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని అనతికాలంలోనే ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బాధ్యతలు కూడా ఆయనకు కలెక్టర్ ఇచ్చే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రిటైర్డ్ అయిన తర్వాత ఆబాధ్యతలను జడ్పీ సీఈవోకు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే.. అనుకున్నంత ఫలితాలు కనిపించకపోవడంతో మయాంక్ సింగ్‌కు ఆ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : కాకులమర్రి

ఏటూరునాగారం రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రోటరీ క్లబ్ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సూచించారు. మండలంలోని శంకరాజుపల్లిలో 30మంది వైద్యాధికారులతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆది వారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారు మూల ఏజెన్సీలోని ప్రస్తుత వస్తున్న రోగాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరుపేద ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో పల్లెల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో సుమారుగా 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగ జ్యోతి, జిల్లా గంథ్రాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గోవిందనాయక్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, సభ్యు లు కాకులమర్రి ప్రదీప్‌రావు, వైద్యాధి కారులు శరత్, విజయ్‌కుమార్, నరేష్, సతీష్, ప్రసాద్, సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, ఉత్తమ్ ప్రవీణ్, లక్ష్మణ్, దివ్య, బీఆర్ఎస్ నాయకులు సునీల్ కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడికి దూరం చేశారని మనోవేదన



అనారోగ్యంతో మంచంపట్టిన సాంబలక్ష్మి

భూపాలపల్లిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాను నిర్వహిస్తున్న గుడిని తనకు దక్కకుండా రోడ్డున పడేశారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ముంటున్న గోపరాజు సాంబలక్ష్మి. తమ సామాజికవర్గానికి చెందిన వారే తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాంబలక్ష్మి 29 సంవత్సరాల క్రితం అప్పటి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధానరోడ్డుకు పక్కనే చిన్న మండపంలో ఊరపోశమ్మను ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు చేస్తోంది. ఈ క్రమంలో ఆమె సేవలను గుర్తించి 2010 ఫిబ్రవరిలో అప్పటి సర్పంచ్ బుర్ర సౌందర్యచంద్రయ్య అనుమతి పత్రాన్ని కూడా అందజేశారు. దీంతో గుడిలో అమ్మవారిని దూపదీప నైవే ద్యాలతో పూజిస్తూ భక్తులు ఇచ్చే కానుకలతో ఆమె జీవనం సాగిస్తోంది. నాలుగు నెలల క్రితం ఓ వ్యక్తి తన అనుచరులతో వచ్చి ఆమెపై దాడి చేయడమే కాకుండా ఆమెకు ఆ గుడిలో చోటే లేకుండా చేశారు. దీంతో ఆ కుటుంబం రోడ్డునపడింది. పైగా మానసిక ఆందోళనతో సాంబలక్ష్మి రోగాలబారిన పడి ఆస్పత్రిపాలైంది. ఇప్పటికైనా ఆమె గుడిని ఆమెకే చెందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.